# అమెరికా పర్యటన ఆసాంతం సామ్రాజ్యవాదులముందు సాగిలబడిన మోడీ ప్రభుత్వం

**ప్రధాని** నరేంద్రమోడీ ఇటీవల మరో విడత అమెరికా పర్యటనలో అమెరికా సామ్రాజ్యవాదుల ముందు సాగిలబడి వారి డిమాండ్లన్నింటికీ తలొగ్గినట్లుగా కనబడుతోంది. ఈ విధంగా బాహాటంగా అమెరికా సామ్రాజ్యవాదులతో చెట్టాపట్టాలేసుకొని సాగటమనే ప్రక్రియ వాజ్‌పాయి ప్రధానిగావున్న కాలంనుండి ప్రారంభమై యుపిఏ, ఎన్‌డిఏల నాయకత్వంలోని ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిరంతరాయంగా కొనసాగుతోంది.

భారతదేశంలో 'సంస్కరణ'ల అమలులో-ప్రత్యేకించి మార్కెట్ రంగం, మేధోసంపత్తి హక్కులు, గత కాలానికి వర్తించే పన్ను, వస్తుసేవల పన్ను మొదలైన అంశాల్లో వేగంగా వ్యవహరించకపోవటం పట్ల ఉన్నతస్థాయి సంయుక్త సమావేశంలో అమెరికా అధికారులు తమ 'అసంతృప్తి'ని వ్యక్తంచేసినట్లు దౌత్యవర్గాలను ఉటంకిస్తూ పత్రికా కథనాలు వెలువడ్డాయి.

ఈ సంవత్సరాంతంలో జరగనున్న 'వాణిజ్య విధానవేదిక'లో అమెరికా కంపెనీల మార్కెట్లకనుగుణమైన విధానాలనన్నీ రూపొందిస్తామని మోడీ తన వైపునుండి ఒబామాకు హామీఇచ్చాడు. భారతదేశంలో నిర్దేశిత ప్రాంతంలో వెయ్యి మెగావాట్ల సామర్ధ్యంగల 6 అణు రియాక్టర్ల నిర్మాణానికి వెస్టింగ్‌హౌస్ కంపెనీ పూనుకునే విధంగా, ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక ప్యాకేజీని అమెరికాకు చెందిన ఎక్స్‌పోర్టు-ఇంపోర్టు బ్యాంకు అందజేసేవైపుగా మోడీ వ్యాపార ఒప్పందాలకు వెనువెంటనే అంగీకరించాడు. ఈ ఒప్పందం 2017 జూన్‌లో సంతకాలు చేసుకొని తుదిరూపం తీసుకోవటం జరుగుతుంది. వెస్టింగ్‌హౌస్ నిర్మించే అణురియాక్టర్లు భారతదేశంలో ఏ ప్రాంతంలో నిర్మించబడతాయి? గుజరాత్‌లోనా, ఆంధ్రప్రదేశ్‌లోనా అనే అంశంలో భారతదేశంలోని పత్రికలలో కొంత గందరగోళం నెలకొనివుంది. నిర్దేశిత స్థలంలో అవి నిర్మించ బడతాయని మాత్రమే సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మోడీ దీనిని ఈ తరహా అంగీకారాలలో 'అతి పెద్దది'గా అభివర్ణించాడు. భారత ప్రజల భద్రతగురించికానీ, అణువిద్యుత్తును వినియోగించే వినియోగదారుడు ఎంతటి అధికధర చెల్లించవలసి వుంటుందనే విషయంగానీ మోడీ పట్టించుకోవల్సిన అంశాలుగా పరిగణించలేదు. ప్రమాదకరమైన, వేగవంతమైన ఈ నిర్ణయం తీసుకొన్నందుకుగానూ, న్యూక్లియర్ సప్లైగ్రూప్ (ఎన్ఎస్‌జి)లోకి, మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రెజీమ్‌లోకీ భారతదేశ ప్రవేశానికి అమెరికా పూర్తి మద్దతునిస్తుందనే వాగ్దానంతో మోడీ సంతోషభరితుడయ్యాడు. భారతదేశం తిరిగివచ్చిన మోడీ, దీనినే భారతదేశానికి అగ్రరాజ్య హోదా కల్పించిన గౌరవంగా పేర్కొన్నాడు. ఈ ప్రకటనలతో ఏమాత్రం సంబంధంలేకుండానే, భారతదేశ పౌర అణుకార్యక్రమం పూర్తిస్థాయిలో అమెరికా సామ్రాజ్యవాదంయొక్క అదుపులో వుందనేది స్పష్టం.

త్వరలో సంతకాలు చేసుకోబోయే ఒప్పందంలో 'సైనిక కదలికలను రూపొందించి, నిర్వహించే ప్రక్రియ మార్పిడి మెమోరాండం' రూపకల్పన తుదిరూపం తీసుకోనుందని ఇరుదేశాల సంయుక్త ప్రకటన పేర్కొంది. ఇది-అమెరికా సైనిక బలగాలు ఒక సాధారణ వ్యవహారంగా భారత సైనిక స్థావరాలను వుపయోగించుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. మోడీ మరో అడుగు ముందుకువేసి, భారతదేశం ఈ తరహా ఇతర ఒప్పందాలకు ద్వారాలు తెరచివుందని ప్రకటించాడు.

భారత-అమెరికా దేశాల నడుమ ద్వైపాక్షిక సైనిక సహకారాన్ని ఆచరణాత్మకంగా విస్తరించటాన్ని మరింతగా సులభతరంచేసే 'ప్రసార, సమాచార భద్రత'వంటి ఒప్పందాలను చేసుకోవటానికి మోడీ సంసిద్ధతను వ్యక్తంచేశాడు. సైనిక సాంకేతికత, వాణిజ్యచొరవ(డిటిటిఐ) ఒప్పందంతో, రెండుదేశాలమధ్య చేసుకున్న సైనిక ఒప్పందాలు మరింతగా బలపడనున్నాయి. ఈ నూతన ఒప్పందం ప్రకారం దేశంలో నావికావ్యవస్థలు, వాయుసేన వ్యవస్థలు ఇతర ఆయుధ వ్యవస్థలు కూడా లోబడివుంటాయి. విమాన వాహకాన్ని నిర్మించటంలో భారతదేశానికి తోడ్పాటు నందిస్తానని అమెరికా వాగ్దానం చేసింది. ఈ విధంగా ముడిమీద ముడివేస్తూ అమెరికా సామ్రాజ్యవాదులు తమ వ్యూహాత్మక లక్ష్యసాధనలో భారతదేశాన్ని జూనియర్ భాగస్వామిగా మరింతగా బిగిస్తున్నారు.

'ఆసియా-పసిఫిక్ మరియు హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత-అమెరికా వ్యూహాత్మక సంయుక్త దర్శనం'లో భాగంగా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో సహకారంగా చెప్పబడే దానితో మనకు ఇది స్పష్టంగా కన్పిస్తుంది. సంయుక్త ప్రకటన ఈ అంశంలో జిత్తులమారి పదాలనుపయోగించినప్పటికీ, భారత-అమెరికా నావికా భద్రతా చర్చగురించి, మరియు ఈ ప్రాంతంలో ప్రాధాన్యతాయుత భాగస్వాములుగా వుండేందుకు అవసరమైన ప్రణాళిక రూపకల్పన గురించి అమెరికా సామ్రాజ్యవాదం భారతదేశాన్ని వత్తిడి చేస్తోంది. దక్షిణచైనా సముద్రంలో చైనాతో తలపడే అమెరికా ఆధిపత్యవ్యూహంలో భారతదేశాన్ని భాగం చేస్తోంది. ఇది-అమెరికా ఆధిపత్య వ్యూహరథ చక్రాలకు భారతదేశాన్ని కట్టివేస్తోంది.

దేశీయంగా చూస్తే, సామ్రాజ్యవాద ప్రభువులపట్ల మోడీ ప్రభుత్వం సాగిలపడే స్వభావాన్ని ప్రదర్శిస్తోంది. 15 రోజుల కాలవ్యవధిలోనే, ఈ ప్రభుత్వం ఆయుధ, రక్షణ ఉత్పత్తిరంగం, విమానయానరంగం, చిల్లరవర్తకరంగం, ఔషధరంగాలవంటి వాటన్నింటిలోకీ వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవేశానికి అనుమతించింది. లాటరీ, జూదం, రియల్‌ఎస్టేట్ ఇన్‌వెస్టిమెంట్ ట్రస్టులు, అణుశక్తి మరియు రైల్వేల నిర్వహణవంటి వాటిలోకి మాత్రమే ఇప్పటికి ఎఫ్‌డిఐకి అనుమతినివ్వవలసివుంది. భారత ఆర్థికవ్యవస్థలోని రంగాలన్నింటినీ సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలోకి లోబరిచే చర్యలే ఇవి. సామ్రాజ్యవాద కంపెనీలను భారత మార్కెట్లలోకి చొరబడేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే వారి డిమాండ్‌కు తలొగ్గే చర్యలే ఇవి. సామ్రాజ్యవాద దేశాల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులపై భారతదేశం తన సైనిక అవసరాలకు వారిపై శాశ్వతంగా ఆధారపడే విధంగా మలుస్తున్నారు. భారతపాలక వర్గాలు వారి ప్రాంతీయ ఆధిపత్య ఆకాంక్షల కనుగుణంగా పొరుగు దేశాలకు వ్యతిరేకంగా దేశంలో జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టటంద్వారా సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యవ్యూహాలనుండి, అలాగే దక్షిణాసియా, హిందూమహాసముద్ర ప్రాంతాలపై భారత పాలక కులీనవర్గపు విస్తరణవాద చర్యలనుండి మనదేశ ప్రజల దృష్టి మళ్ళించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ చర్యలన్నింటినీ నిలిపివేయాలి. ఇరుగు పొరుగు దేశాలలో మంచి ఆర్థిక, స్నేహసంబంధాలను నెలకొల్పుకొనే విధంగా, భారతప్రజల ప్రయోజనాల కనుగుణమైన స్వతంత్ర, సార్వభౌమవిదేశాంగ విధానం భారతదేశానికి అవసరం. అంతేగానీ, ఇరుగుపొరుగు దేశాలకు వ్యతిరేకంగా ప్రత్యేకించి ఆసియా, ఆఫ్రికా, లాటిన్‌అమెరికా దేశాలకు వ్యతిరేకంగా సామ్రాజ్య వాదులతో చేతులుకలిపే విధానాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. అమెరికా-భారత కూటమి గురించిన కీర్తిగానాల ప్రచారాన్ని వ్యతిరేకించాలి. అమెరికా సామ్రాజ్యవాద కబంధ హస్తాలనుండి భారతదేశం బయటకు రావాలని డిమాండ్ చేయాలి.

ooooo